సరాగ రాగం

పార్వతి కోసం ఎదురుచూస్తూ, గోపాలం మంచంమీద కూర్చున్నాడు కాళ్లు పైకి పెట్టుకున్నాడు. నేల తేమగా ఉంది. వంటింట్లో అంతా భోజనాలు చేసిన తర్వాత గచ్చు కడిగారు తడి ఆరలేదు. సాయంత్రం అనుకోకుండా చుట్టాలొచ్చారు వాళ్ళందరినీ హాలులో పడుకోబెట్టి, కొందరిని వరండాలో పడుకోమని, తను మెల్లిగా వంటింట్లోకి చేరక తప్పలేదు. అరికాళ్లు తుండుగుడ్డతో తుడుచుకుని మల్లెపువ్వులాంటి పక్క మాసిపోకుండా బాసిపెట్టువేసుకుని కూర్చున్నాడు. కిందా, పక్కనా, పైనాఎలికలు జంటలు జంటలుగా తిరుగుతున్నాయి. వాటిని పట్టుకోవటానికి పెట్టిన బోనులో పిల్లి పిల్ల పడటం, వెంటనేచూసి తప్పించడం వలన ఆ హత్యాదోషం కొద్దిలో తప్పి గుడికట్టించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆ నాటినుంచి ఎలికల్ని పట్టుకునే భారం ఆ పిల్లిపిల్లకు వప్పచెప్పేసి ఊరుకున్నారు.

గోపాలం మెడవంచి మధ్య హాలులోకి తొంగి చూశాడు. పార్వతి అక్కడ బాసిపెట్టు వేసుక్కూర్చొని కొత్తగా వచ్చిన చుట్టాలువేసే ప్రశ్నలన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు చెపుతోంది అక్కడ కూర్చున్న వాళ్ళందరికీ పెళ్ళయి ఏళ్ళు గడిచి పోయినాయి అందులో కొంత మందికి వాళ్ళ పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాల్సిన వయసుగూడా వచ్చింది. గోపాలానికి పెళ్ళయి ఏడాది దాటలేదు. కబుర్లు చెప్పేవాళ్ళకి బుద్ధి ఉన్నదా, లేదా? అని తీర్పు ఇచ్చే అధికారం తనకు లేకపోయినా, పార్వతి ఏదో సాకు చెప్పి అక్కడనుంచి లేచివస్తే బాగుండునని గోపాలానికుంది. ఏమని చెపుతాడు? ఒక్క నిమిషం ఆలోచనలో పడ్డాడు మెల్లిగా దుప్పటిలాక్కుని పడుకున్నాడు. కూర్చుని ఉంటే తనని గూడా కబుర్లు చెప్పటానికి రమ్మంటారేమోనని భయం. కళ్ళుమూసుకుంటే నిద్రపడుతుందేమోనని భయం. కళ్ళు తెరుచుకుని పైకిచూస్తే ఎలికలు అటక మీద తిరుగుతూ అతనివంకచూసి చెవులు రిక్కిస్తున్నాయి తళుక్కున ఆలోచన వకటి మెరపులా మబ్బులు పట్టిన తన మనస్సుమీద మెరిసింది.

'కాసిని మంచినీళ్ళిచ్చిపో..' అన్నాడు

ఇసుకపల్లి దక్షిణామూర్తి

లేచి కూర్చుని. ధుప్పటి పక్కకు తోసేశాడు.

గోపాలం తల్లి వర్ధనమ్మ ఆ మాట వింది

'వాడేదో అడుగుతున్నాడు చూడమ్మా...' అని ''వచ్చేపొద్దా... పోయేపొద్దా ... పోయి పడుకోండి ... కబుర్లకేమొచ్చె ... తెల్లవారింతర్వాత చెప్పుకుందురుగాని..."అంది పార్వతి 'ఏమిటి...పిలిచారు...'’అని అడిగింది.

'ఆ...ఏంలేదు. దొడ్లోకిపోయి తెల్లవారిందేమో చూసివస్తావని పిలిచాను.' అన్నాడు గోపాలం పార్వతికి నవ్వు వచ్చింది.

'మీరే చూడకపోయారూ,...! దొడ్లోకి వంటరిగా వెళ్ళాలంటే భయంవేసిందా..' అంది పార్వతి, మెల్లిగా తలుపు దగ్గరిగా వేసి గడియవేసి వచ్చింది.

'ఎంతసేపు అక్కడ కబుర్లు ,అంతూ పొంతూ అక్కర్లేదా...' అన్నాడు గోపాలం విసుక్కుంటున్నట్టు

'అయితే వాళ్ళు అడిగినదానికి సమాధానం చెప్పకుండా వచ్చెయ్యమంటారా.. నే వెళ్ళి జోలపాటపాడితేగాని మా ఆయన

నిద్రపోరూ... నన్ను వదిలెయ్యండి... అని వాళ్ళని అడగమంటారా..' పార్వతి అలమారలోని తమలపాకులు, వక్క పొడిడబ్బా తీసుకు వచ్చింది.

'అట్లా ఏం చెప్పక్కర్లా...ప్రతిదానికీ చెప్పే తీరుంటుంది..' గోపాలం కొద్దిగా వక్కపొడి అందుకున్నాడు.

"ప్రతిదానికీ నన్ను అని మీపిరికితనం దాచుకోవడంగాని ఇంకోటికాదు...మీకు మీ అమ్మగారిని చూస్తే హడలు. 'కబుర్లు చాల్లెండి...ఎంతసేపు పడుకోకుండా?' అని అడిగేధైర్యం మీకుండాలిగాని ఆడదాన్ని నేను ఏమన్నా మాట్లాడటం బాగుంటుందా..." పార్వతి తమలపాకులకి సున్నంరాసి ఈనెలు తీసింది.

'ఇట్లా ఇయ్యి...'

'నోరు తెరవండి...'

'మెల్లిగా మాట్లాడు ... ఎవరన్నా వింటారు...'

'నోరు ముయ్యండి అంటే తప్పుగాని నోరు తెరవండి అంటే అందులో తప్పేం లేదు. ఎవరన్నా విన్నా ఫరవాలేదు...'

తమలపాకు చిలకల్ని నములుతూ కిటికీలోనుంచి బయటకు చూశాడు. కాచిన వెన్నెలంతా నేల తాగేస్తోంది. కొబ్బరి ఆకులు వెన్నెట్లో మాగుతున్నాయి. అందంగా మెరుస్తున్నాయి. దొడ్డంతా మల్లెపూలు పరిచినట్లుంది. పార్వతి తల్లో పూల చెండు వాసనలు విరజిమ్ముతోంది.

'నీ తల్లో పూలు బాగున్నాయి...'

'కథలు వ్రాస్తారుగా ... ఊరికే బాగున్నాయి అనకపోతే...నల్లటి కొండమీద మంచు శిఖరంలా తలమీద పూల చెండు ఉందనో...మనసున మల్లెల మాలలూగెనే, శిరసున మల్లెలుఊయలూగెనే.. అనో కొంచెం కవిత్వం చెప్పరాదూ...' పార్వతి చిరునవ్వు నవ్వితే పళ్ల వరుసలు కొంచెంగా కనపడి తళుక్కుమన్నాయి.

'నీక్కూడా కవిత్వం అల్లటం వస్తోందే...'

'మీ కవిత్వమే నాకూ కొంచెం అంటిందిలెండి .. మీ పిరికితనమే అంటలా...'

'నాకు పిరికితనమని ఎవరుచెప్పారు..'

'ఇప్పటి సంగతి ఎవరు చెప్పాలి. కనపడుతునే ఉందిగా ... చిన్నప్పటి నుంచి ఇల్లాగే ఉండేవారని మీ అమ్మగారే చెప్పారు నాకు ..'

'ఏదో తమాషా కని ఉంటుంది....'

'తమాషాలేదు ... గిమాషాలేదు ... ఎవరన్నా ఇంటికివస్తే పారిపోయి గదిలో కూర్చునేవారుట ... ఏమన్నా చేతికిస్తే తినకుండా చేతిలోనే పెట్టుకునేవారుట... మీ అమ్మగారు వచ్చి తినమనిఅంటే అప్పుడు తినేవారుట...అంతాచెప్పారు.. వాళ్ళెవరింటికో భోజనానికివెళ్ళి .అమ్మా ఈగారప్పచ్చి తిననుటే ... ఈ చింతకాయ పచ్చడి తిననుటే ... అని అన్నీ అడిగి తినేవారుటగా ... మీరు దాస్తేదాగుతుందేమిటి ... ఆ భయమే ఇప్పటికీ ఉంది. మీ అమ్మగారిని చూస్తేహడలు,

మీ నాన్నగారిని చూ స్తేహడలు...పక్క భాగంలో వాళ్ళనిచూ స్తే హడలు ... హడలు, హడలు...'

పార్వతి పాలు తీసుకు వచ్చింది. 'తాగండి...' అంది.

'పోనీ మీ అమ్మగారిని అడిగి తాగు తారా...' అంది. గోపాలానికి చిరుకోపం వచ్చింది. పాలగ్లాసు అందుకున్నాడు. గడ గడా తాగేశాడు.

'మీరు కథలు వ్రాస్తారుగదా...నాకు గూడా వ్రాయటం నేర్పరాదుటండీ...' పార్వతి విషయం మార్చేసింది. 'చక్కగా పత్రికల్లో పేరూ పడుతుంది, నాలుగు డబ్బులూవస్తాయి...'

'వ్రాయి...ఎవరొద్దన్నారు...'

'వ్రాయటం చేతకావద్దేమిటీ...దాని కిటుకులు చెపుతే నేర్చుకుందామని కదూ. ఇన్ని కథలు వ్రాశారు...నా చేత కథ వ్రాయి స్తే...అదీ గొప్ప...'

గోపాలం కోపం పోయింది. మనస్సు తేలికయినట్లయింది. తనకు విలువ హెచ్చినట్టు తోచింది. తనపెళ్ళి కాక మునుపుగూడా అనేకమంది స్నేహితులు తనే కథలు వ్రాసే గోపాలం అని తెలుసుకుని మర్యాద ఇవ్వటం బాగాగుర్తు. నిత్య అనుభవంగా ఉండేది. స్నేహితులే కాకుండా కొంతమంది స్నేహితురాళ్ళు గూడా దొరికారు. అంతా మెచ్చుకునేవారు — కాని పార్వతి మాత్రం మొదటినుంచీ ఏదోరకంగా ఎగతాళి చేస్తూనే వచ్చింది గాని తనని మెచ్చుకున్న సందర్భాలు కనిపించలేదు. ఎంత మంది ఊళ్ళోవాళ్ళు మెచ్చుకున్నా పెళ్ళాం హర్షించకపోవడం కొంచెం లోపంగానే ఉంటోంది. మనస్సు చివుక్కుమంటుంది. పార్వతివచ్చిన కొత్తలో తను వ్రాసినకథలను గురించిన అనేక వివరాలు చెప్పుకవచ్చాడు. 'అట్లాగా... అట్లాగా...' అంటూ ఊరుకుందిగాని. 'అబ్బా...మీ కథలంటేనాకు చాలా ఇష్టమండీ...మీ కథ వక్కటిగూడా వదిలి పెట్టలేదు...కొన్ని కథలు రెండు మూడు సార్లు చదివాను...' అటుందేమోనని ఆశించాడు.అట్లాంటి ప్రవర్తన కనిపించక పోవడం ఆశాభంగంగానే ఉంది, అందరి మనస్తత్వాలూ నిశితంగా పరిశీలించగలను అనుకున్న గోపాలం పార్వతి విషయం మాత్రం తెలుసుకోలేక పోయాడు.

'ఆడవాళ్ళ కళ్ళు చేపల్లాగా ఉంటాయని అంటా రెందుకనండీ...' అని అడిగింది పార్వతి.

'చేపల్లాగా ఉంటాయి కాబట్టే...' అన్నాడు గోపాలం తడుముకోకుండా.

'మరి చెవులు చేపతోకల్లాగా ... బుగ్గలు చేపనడుములాగా...చింపిరిజుట్టు విసిరిన వలలాగా ఉంటాయి గదా ... ఆ విషయం ఎవరూ వ్రాయరేమండీ...' అంది పార్వతి. గోపాలం గతుక్కుమన్నాడు.

'నా డైరీ తీశావా...'అన్నాడు.

'మీ డైరీ సంగతి నా కేం తెలుసు... పొద్దున వక ముష్టి అమ్మాయి వస్తే నా కట్లా కనబడింది......అందుకని అడిగాను...' పార్వతి నవ్వు దాచుకోలేక పోతోంది

'అయితే ఇకనుంచీ డైరీ పెట్టెలో పెట్టి తాళం వెయ్యాలన్న మాట...'

'ఏం నేను చూడగూడదా...?'

'డైరీలు చూడగూడదు...'

'నాకు తెలియని రహస్య మంటూ మీ దగ్గర ఉండగూడదు...'

'అదే అనుకుంటున్నాను...'

'మీరేమైనా అనండి......రహస్య మంటూ మనదగ్గిర ఎనికిరాదు... పెట్టెలో పెట్టండి..భోషాణంలోపెట్టండి.. మీరు రహస్యమని అనుకున్నచోట నేనే ఉంటాను...' పార్వతి నవ్వుతోంది

'మెల్లిగా......హాలులో వాళ్ళు వింటారు...'

'తప్పేమిటండీ...ప్రతిదానికీ భయ మేనా ... మొగుడూ, పెళ్ళాం అన్న తర్వాత మాట్లాడుకోకుండా, నవ్వుకో కుండా ఉంటారా .. అంత హడలు అయితే ఎట్లాగండీ...'

'దీంట్లో హడలేమిటి ... విరగబడి వెర్రివాళ్ళ నవ్వుతారు...'

'నాకు వెర్రి, పిచ్చి అని ఎందుకు అంటారు '...మీకు మి అమ్మ గారు అంటే భయం అని వప్పుకోండి... నేను నోరు మూసుకుంటాను ...' అంది పార్వతి. మంచం మీద పక్కనే కూర్చుంది. గోపాలం మీదకు వరిగింది. 'ఏమిటి; వప్పుకుంటారా...' అంది గోపాలం కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ.

'ఇక్కడ ఎవరికీ భయం లేదు... అంతా నువ్వు కల్పించింది తప్పితే...'

'అయితే పందెం కడతారా... చెప్పండి...'

'ఏమిటి పందెం...'

'మీ అమ్మగారంటే మీకు భయం అని నేను...భయం కాదని మీరు...'

'అనవసరంగా గొడవ చెయ్యకు... ఎదకొం దవస్తోంది...'

'అట్లా అంటేకాదు .పందెం...మీరు ఓడిపోతే ... నాకు షిఫాను చీరె కొని పెట్టాలి...నేనే ఓడిపోతే కాశ్మీరు సిల్కు చీరె కొనిపెడితే సరిపోతుంది..సరేనా..'

గోపాలం నవ్వుతున్నాడు.

'ఏమయితే ఏమయింది...నీకు చీరె కొనిపెట్టడం తప్పదుగా...' అన్నాడు. 'ఇంతకీ పందెం ఏమిటి...'

'పందెం ఏమీలేదు...బాగా వెన్నెల కాస్తోంది కదండి...కాసేపు డాబామీదకు పోయి కబుర్లు చెప్పుకొని వద్దాం. మీకు ధైర్యం ఉంటే, మీ అమ్మగారంటే భయం లేకపోతే...మీ అమ్మగారిని అడగండి. అడిగి వెళదాం...'

'ఇప్పుడు వాళ్ళందరినీ లేపటం ఎందుకు...దొడ్డి దారి వెరబడి పోదాం..'

'మాట తిప్పుతా రెందుకు? అడగటానికిభయమేనా...అమ్మగారంటే నాకు భయం అని వప్పుకోండి...ఇటేపోదాం.. ఇంతచిన్న విషయానికి గూడా హడలు.'

'అడగటాని కేం భయం కాదు... అనవసరంగా వాళ్ళ నిద్ర చెడగొట్టట మెందుకని గాని...'

'అదికాదండీ..అప్పుడొకసారి మనం రాత్రిపూట రోడ్డుమీదకు షికారుగా వచ్చామా...ఎటు వెళ్ళామో ఏమిటో అని వాళ్ళు భయపడ్డారుట ... నాతో అన్నారు ... వక్కసారి అడిగిపోతే సరిపోతుంది...'

'అనవసరంగా నిద్రలేపటం ఎందుకా అని - దొడ్లోనుంచిపోతే సరిపోలా ..'

'మళ్ళీ మీరు ... అదేమాట...రాజా లాగా సింహద్వారం లోనుంచిపోక ... దొడ్డి గుమ్మంలోనుంచి ఎందుకండీ...' అంది పార్వతి. గోపాలం తటపటాయించాడు. వక క్షణం ఆలోచించాడు. 'సరేపద...' అన్నాడు. మధ్య తలుపు తీశాడు. తలుపు చప్పుడికి తల్లి వర్ధనమ్మ ఉలిక్కిపడి లేచింది

'అబ్బాయీ...లేచావుటరా..' అంది, కళ్లు బలవంతానా తెరిచింది

'కాసేపు మేడమీద కూర్చుని వస్తాము...' అన్నాడు గోపాలం ధైర్యంగా.

'అట్లాగేకాని ...డాబామీద కొబ్బరి మట్టలు...తుక్కు వున్నాయి...కొంచెం దూరంగా కూర్చోండి...బయట చల్లగా ఉంది...ఎక్కువసేపు ఉండకండి...' అంది వర్ధనమ్మ. గోపాలం, పార్వతీ మెల్లిగా బయటకు వచ్చారు. వెన్నెట్లో దొడ్డి అంతా మునిగిపోయింది. మామిడి చెట్టు పక్కగా మెట్లున్నాయి. చుట్టుపక్కల ఇళ్ళలో వాళ్ళంతా గాఢ నిద్రలో ఉన్నారు. మెట్లదగ్గరకు రాగానే పార్వతి భుజంమీద చెయ్యివేశాడు గోపాలం. పార్వతి అతన్ని అంటిపెట్టుకుని మెట్లు ఎక్కటం మొదలు పెట్టింది ఇద్దరూ కలిసి ఒకళ్ళుగా డాబా ఎక్కారు.

'అయితే షిఫానుచీరె కొనుక్కురావటానికి రేపు పోదామంటారా...' అంది పార్వతి

'షిఫానుచీరె గూడాను..మాఅమ్మంటే నాకు పెద్ద భయమన్నావే...నిద్ర లేపటం ఎందుకని కాస్త ఆలోచించాగాని...' అన్నాడు గోపాలం.

'ఓడిపోయి ఇంకా మాటలు మెలిక వేస్తారెందుకు ..? కట్టుకున్న భార్యతో మేడమీద కాసేపు కబుర్లు చెప్పుకోవాలన్నా మీకు మీ అమ్మగారి పర్మిషన్ కావాల్సివచ్చె ..దీన్ని హడలు కాకపోతే ఇంకేం పేరుతో పిలుస్తారు...?' ఏకపకా నవ్వుతూ గోపాలాన్ని లతలాగా అల్లుకుంది పార్వతి ★